క్లుప్తంగా

కళాశాల పరిశుభ్రం



కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: దాదాపు 40 ఏకరాల విస్తీర్ణంలో ఉన్న పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ పూర్వవిద్యార్థుల సంఘం, కళాశాల సిబ్బంది, నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి దాదాపు 100 మందికి పైగా కళాశాల ఆవరణాన్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, పూర్వ విద్యార్థుల సంఘ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, రిటైర్డ్ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పీవీ కృష్ణారావు, హరీష్ చారిట్రబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తలాటం హరీష్ పాల్గొన్నారు.

భవిష్యత్తు ఉన్న నాయకుడు రాజా

బోట్‌క్లబ్: భవిష్యత్తు ఉన్న ప్రజా నాయకుడు వరపుల రాజా చనిపోవడం బాధాకరమని అని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రత్తిపాడు నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారన్నారు. అధికారం లేకపోయినప్పటికీ తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించేవారన్నారు. అటువంటి నాయకుడు మృతిచెందడం విచారకరమన్నారు. వారి కుటుంబ సభ్యలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బీజేపీ నాయకురాలు భానుమతి మృతి



భానుమతి (ఫైల్)

కాకినాడ రూరల్: బీజేపీ నాయకురాలు భానుమతి(88) ఆదివారం మృతి చెందారు. బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆమె 1998–2002 కాలంలో తాళ్లరేవు అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా పార్టీ తరపున పని చేశారు. కోలంకలో కొన్నాళ్లు కాశీకృష్ణాపీఠాధిపతిగా వ్యవహరించారు. ఆమె మృతికి బీజేపీ నాయకులు కంటిపూడి సర్వారాయుడు, పైడా కృష్ణమోహన్ తదితర నాయకులు సంతాపం తెలియజేశారు.


క్రీడాకారులకు చేయూత



మహిళలకు కిట్లు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ హరీష్

బాలాజీచెరువు: క్రీడాకారులకు, పోలీస్, ఆర్మీ పరీక్షలకు హాజరయ్యే పేద అభ్యర్థులకు తమ వంతు సహకారం అందిస్తున్నట్టు హరీష్ చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. ఇటీవల కానిస్టేబుల్ పరీక్షలో ఉత్తీర్ణులై ఫిజికల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ఉచితంగా స్పోర్ట్స్ సామగ్రిని ఆదివారం అందజేశారు. అర్హత ఉండి సదుపాయాలు లేని వారు తనను సంప్రదిస్తే తన ట్రస్ట్ ద్వారా సాయం చేస్తానని హరీష్ తెలిపారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



చదవడం మాకిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గ్రంథాలయాల శాఖల్లో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సండే స్టోరీ పేరుతో సెలవు రోజుల్లో చదువుకు విరామం కలగకుండా విద్యార్థులు చందమామ కథలు, అల్లాడిన్, దిప్లాంట్ కింగ్డమ్, వండర్ఫుల్ స్టోరీస్ ఆఫ్ ది వరల్డ్ తదితర పుస్తకాలు అభ్యసిస్తున్నారు. దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు తెలిపారు.

నేడు 'స్పందన'

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: నడకుదురులో ఆదివారం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచారు. ముందుగా డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా హఠాన్మరణానికి సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నాట్య కిరణాలు



నర్తనకిరణం అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

- నృత్యంలో రాణిస్తున్న విద్యార్థినులు
- నర్తన కిరణం పురస్కారాలు స్వీకరణ

కాకినాడ కల్చరల్: కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థినులు నృత్యం, సంగీతం కళలలో కూడా రాణిస్తున్నారు. ఒకవైపు విద్యను అభ్యసిస్తునే మరో వైపు కళలను నేర్చుకొంటున్నారు. చదువుకు కళలు ఆటంకం కాదని నిరూపిస్తున్నారు. అంతేకాకుండా కళలలో శిక్షణ పొందడం ద్వారా ఏకగ్రాత, మానసిక ప్రశాంతత చేకూరుతోందని చెబుతున్నారు. దీనికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించడంతో విద్యార్థినులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ సత్తా చాటుతున్నారు. ఇటీవల విశాఖ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో విశాఖ నాట్యగురువుల సమాఖ్య ఆధ్వర్యంలో విశాఖ నృత్య కళాతోరణం పేరుతో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రదర్శనలో విద్యార్థినులు పాల్గొని చక్కని హావభావాలతో నాట్యం చేసి, నర్తన కిరణం పురస్కారాలు అందుకున్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

నాట్యం అంటే ప్రాణం



నా పేరు గీసాల బిందు జయశ్రీ. నర్తన కిరణం అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. మూడో తరగతి చదువుతున్నాను. అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శన చేయడమే నా కోరిక. అందరిని మెప్పించాలనే ఆశయంతో నృత్యం నేర్చుకొంటున్నాను. మా తల్లిదండ్రులు శివసురేష్, బేబి మంచి సహకారం అందిస్తున్నారు.

మంచి పేరు తెచ్చుకుంటా..



నాపేరు డి.జాహ్నవి. నర్తన కిరణం అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉంది. 8వ తరగతి చదువుతున్నాను. శాస్త్రీయ నృత్యం అంటే ప్రాణం. నృత్యంలో మరిన్ని మెళకువలు నేర్చుకొని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన చేయాలనేదే నా కోరిక. చదువుకు కళల అభ్యసన ఆటంకం కాదు మరింత ఏకాగ్రత పెరుగుతోంది. చాలా నృత్య ప్రదర్శనలు ఇచ్చాను.

పదేళ్ల నుంచి నేర్చుకుంటున్నా..



నాపేరు అక్షయ భావన. 8వ తరగతి చదువుతున్నాను. నర్తన కిరణం అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. 10 సంవత్సరాల నుంచి నృత్యం నేర్చుకొంటున్నాను. నృత్యం నేర్చుకోవడం వలన ఏకగ్రాత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. సంప్రదాయ నృత్యాన్ని ఇష్టంతో సంతోషంగా సాధన చేయాలి. నాట్యరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనేదే నా కోరిక. నాట్య మయూరి, నాట్యవారధి, నర్తన కీర్తి తదితర అవార్డులు పొందాను.

నృత్యానికి ఆదరణ



ప్రస్తుతం నృత్యానికి ఆదరణ పెరుగుతోంది. నాట్యం నేర్చుకోవాలనే ఉన్నత ఆశయంతో ఉన్న విద్యార్థినులు గుర్తించి నర్తకీమణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. మన భారత దేశ సంస్కృతికి చిహ్నాలలో ఒకటి నృత్యం. నృత్యం నేర్పించి కళలను కాపాడేందుకు చిరు ప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చే స్థాయిలో నృత్యంలో శిక్షణ ఇస్తున్నాం.

–నాట్యాచార్య, బేతా సత్యనారాయణ, కాకినాడ

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టరు సువర్ణరాజు

కాకినాడ రూరల్: వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు ప్రబలుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టరు సువర్ణరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు వైద్య సేవలందించారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, ఉదయం కురుస్తున్న మంచు కారణంగా జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. ఇన్ఫెక్షన్ లక్షణాలతో దగ్గు ఎక్కువ రోజులు పాటు ఉంటుందన్నారు. యాంటీ బయోటిక్స్ మందులు వాడరాదని, సాధ్యమైనంత వరకు ఎండలో తిరగాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి డిగ్రీ పరీక్షలు

కాకినాడ సిటీ: స్థానిక అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి, మూడో సెమిస్టర్ ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.అనంత లక్ష్మి తెలిపారు. మూడోవ సెమిస్టర్ పరీక్షలు 9న ప్రారంభమై 27తో ముగిస్తాయన్నారు. అదేవిధంగా మొదటి సెమిస్టర్ పరీక్షలు పదో తేదీన మొదలైన 25వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం 5వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థినులకు ఏప్రిల్ 12వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 2015, 2019 మధ్యలో డిగ్రీ చదివి పరీక్షలు పాస్ అవ్వలసిన విద్యార్థినుల కోసం బ్యాక్‌లాగ్ నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. 19వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యలో రూ.100 అపరాధ రుసుం, 28వ తేదీ వరకు అయితే రూ.500 అపరాధ రుసుం, 30వ తేదీ వరకు రూ.1000 అపరాధ రుసుంతో అప్లికేషన్లు స్వీకరించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.యమున వివరించారు.

దివ్యాంగురాలికి తీవ్ర గాయాలు

కాకినాడ క్రైం: హిట్ అండ్ రన్ ఘటనలో దివ్యాంగురాలైన ఓ బాలికతో పాటు ఆమె తండ్రికి తీవ్ర గాయాలపాలయ్యాయి. ప్రాణాపాయం నుంచి కాస్తలో తప్పించుకొని బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... కాకినాడ జీపీటీ సమీపంలో నివాసం ఉండే నానిపల్లి లోవరాజుకు ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. లోవరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన పెద్దకుమార్తె (14) నాగదుర్గను పిఠాపురం మండలం విరవలో తన నాన్నమ్మ చక్రమ్మ ఇంట్లో ఉంచి చదివిస్తున్నాడు. శనివారం రాత్రి కాకినాడకు తీసుకొచ్చే క్రమంలో విరవ నుంచి కుమార్తెతో కలిసి ఆటోలో బయలుదేరాడు. పాదగయ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను సమీపించే సరికి ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఆటో తిరగబడి అప్పటికే అంగవైకల్యం ఉన్న నాగదుర్గ ఎడమచేతిపై పడింది. ఈ ఘటనలో బాలిక చేతి ఛిద్రమైంది. తండ్రి లోవరాజు నడుము భాగంలో తీవ్రగాయమైంది. ప్రమాదాన్ని గమనించిన ఇతర వాహనచోదకులు ఆగి వారిని 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాలికకు ఆదివారం సాయంత్రం జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఘటనపై పిఠాపురం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

9 నుంచి డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈనెల 9వ తేదీ నుంచి తొమ్మిది జిల్లాలోని డ్వామా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఈసీటీ మేనేజరు పి.శ్రీనివాసు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని డ్వామా ఏపీడీ ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామన్నారు.

చెందుర్తిలో రెండు వర్గాల మధ్య వివాదం

- పెద్ద చెరువు విషయంలో గొడవ
- పోలీసులు, రెవెన్యూ అధికారుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉన్న పెద్ద చెరువుపై తమకు హక్కు ఉందని రెండు వర్గాలు వివాదానికి దిగడంతో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసు, రెవెన్యూ అధికారులు చెరువు వద్దకు వెళ్లి ఇరు వర్గాలను నిలువరించారు. వివరాల్లోకి వెళితే.. చెందుర్తి సర్వే నంబర్ 234లో 92 ఎకరాల వ్యవసాయ చెరువు ఉంది. ఈ చెరువుపై ఆధారపడి సుమారు 500 ఎకరాల్లో రైతులు పంటలు పండించుకుంటున్నారు. దీనిలో చెందుర్తి, కొడవలి గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు మత్స్యకార సొసైటీగా ఏర్పడి చేపలు పెంచుకుని అమ్ముకుంటున్నారు. కాగా శనివారం ఆ మత్స్యకార సంఘం సభ్యులు చెరువులో చేపలు పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన మరో వర్గం వ్యక్తులు ఆ చెరువుపై తమకు హక్కు ఉందని గొడవకు దిగారు. దీంతో ఆదివారం ఉదయం ఇరు వర్గాలు చెరువు వద్దకు చేరుకుని చేపలు పట్టుకునే విషయంలో వివాదానికి దిగారు. ఇరు వర్గాల వారు వేర్వేరుగా టెంట్‌లు ఏర్పాటు చేసుకుని ఒకరిపై ఒకరు పంతాలకు పోయి దాడులకు తెగబడడానికి సిద్ధమయ్యారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత స్థానిక మత్స్యశాకాధికారి రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి అసలు చెరువుపై ఎవరికి హక్కు ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే పాత సంఘం గత రెండేళ్లుగా రెన్యువల్ చేయించుకోలేదని మత్స్యశాఖాధికారి చెప్పడంతో విషయం తేలే వరకూ ఏ వర్గ సభ్యులు చెరువు వద్దకు రావడానికి వీలు లేదని హుకుం జారీ చేశారు. అప్పటివరకూ పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందితో కాపలా కాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇరు వర్గాలు అక్కడి నుంచి వెళ్లి పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల వేలంపాటలు పెండింగ్‌లో ఉన్నాయని మత్స్యశాఖాధికారి రామకృష్ణ తెలిపారు. అధికారుల నిర్ణయంతో వివాదం సద్దుమణిగింది.

రక్తదానం



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక ఫ్రెండ్స్ కాలనీలో ఆదివారం కాకినాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సమయానికి రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారికి మనం చేసే రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారు ప్రతి ఆరు నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గంటి భాస్కరరావు, కార్యదర్శి గ్రంధి సతీష్, కోశాధికారి సురేష్‌కుమార్, సభ్యులు డాక్టర్ అహ్మద్, రామ్మోహనరావు, పాల్గొన్నారు.

సరస్వతీదేవి పూజలు



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ: టెన్త్, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఆదివారం కాకినాడ జగన్నాథపురం జమ్మిచెట్టు సెంటర్‌లోని శ్రీదేవి ఆలయంలో సరస్వతీదేవి పూజ నిర్వహించారు. విజయ భక్త బాల యువజన సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిషోర్ మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మాదిరెడ్డి కృష్ణమూర్తి, కె.సూర్యచంద్రరావు, నాని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

కొత్తపల్లి: కొండెవరంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను ప్రారంభించారు. తొలిరోజు ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఇంజనంపాడుకు చెందిన స్నేహ ఆర్ట్స్ వారితో కొండంత అండ, వెంకటాద్రి హేచరీ అధినేత తెలగంశెట్టి వెంకటేశ్వరావు ఆర్థిక సహాయంతో తొలి తిరుపతికి చెందిన శృంగారవల్లభ ఆర్ట్స్ వారితో కబ్జా నాటికలను ప్రదర్శించారు.

తొలి ప్రదర్శనగా కొండంత అండ

పంటకు పట్టిన చీడపీడలను వదిలించుకోవడం రైతుల బాధ్యత. ప్రకృతి వైపరీత్యాలు, కష్టాలు సంభవించినప్పుడు ఎదురొడ్డి పోరాడుతూ ప్రకృతి సమతుల్యాన్ని కాపాడడంతో పాటు స్వార్థ పూరిత మనస్తత్వాలను సరిచేసుకుంటూ తోటివారికి తోడు, నీడలా ఉండడమే జీవిత పరమార్థమని నమ్మిన ఓ రైతు కథ కొండంత అండ. ఈ నాటికలో కళాకారులు జి.సాంబశివరావు, ఎస్‌బీ చినఆదాం షఫీ, నెమలికంటి వెంకటరమణ, మధు, వి.గోపాల్‌రెడ్డి, మనోహర్ నటించారు.

ఆకట్టుకున్న కబ్జా

దేశాన్ని ఆక్రమిస్తే దురాక్రమణ. మనిషి మరో మనిషిని దోచుకుంటే దోపిడీ, స్థలాలను ఆక్రమిస్తే ఆక్రమణ అనే వృత్తాంతంతో సాగే కబ్జా నాటిక ప్రేక్షకులను అలరించింది. సమాజంలో న్యాయం, ధర్మం, చట్టాలను అతిక్రమించి స్థలాలు ఏ విధంగా కబ్జాకు గురవుతున్నాయనే సన్నివేశాలను కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. నటులుగా మాధవి, కె.కాశీ, వై.వాసు, శ్రీరామ సత్యనారాయణ నటించారు.

ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

- న్యాయవాది పెండెం శ్రీదేవి
- మహిళా దినోత్సవ వారోత్సవాలు



న్యాయవాదులను సన్మానిస్తున్న అడబాల రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలని న్యాయవాది పెండెం శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికి పరిమితమవ్వకుండా చైతన్యంతో మెలగాలన్నారు. భర్త, పిల్లలకు వండి పెట్టడమే తన కర్తవ్యంగా భావించకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మరో న్యాయవాది నాగజ్యోతి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ఎదుగుతున్నారన్నారు. అయినా వివక్షత కొనసాగుతుందన్నారు. గృహ హింస నిరోధక చట్టం, నిర్భయ, బాల్య వివాహాల నివారణ చట్టాలు మహిళలకు అనుకూలంగా ఉన్నా ఇంకా దాడులు జరుగుతున్నాయన్నారు. సమాజంలో నెలకొన్న పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొవడానికి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం న్యాయవాదులు శ్రీదేవి, నాగజ్యోతిలను అడబాల రత్నప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టరు సువర రాజు, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, శ్రీనగేష్, డాక్టరు శిరీష, రాఘవరావు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50 పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాలు నుంచి ప్రముఖ డిజైనర్లు చేసిన డిజైన్లను నగర ప్రజలకు పరిచయం చేసినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన మంగళవారం రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మామ, అల్లుడు

కరప: గ్రామంలోని దుర్గాదేవి సెంటర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామ, అల్లుడికి గాయాలవడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన గుత్తుల త్రిమూర్తులు, కె.గంగవరం మండలం ఎర్రపోతవరం గ్రామానికి చెందిన చింతపల్లి సత్తిబాబు(మామ, అల్లుడు)లు కరప గ్రామంలో జరిగిన ఒక ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చారు. ఇద్దరు మోటారుసైకిల్‌పై తిరిగి వెళ్లిపోతుండగా దుర్గాదేవి గుడి అరట్లకట్ట రోడ్డు మలుపు వద్దకు వెళ్లే సరికి కాకినాడ వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తల, కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదం గురించి కరప ఎస్ఐ నౌడు రామకృష్ణను వివరణ కోరగా ఇంత వరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

సహకార సంఘాలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ సభ్యులు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): సహకార సంఘాల ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ అమలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. కాకినాడలోని సహకార శ్రీనిలయంలో ఆదివారం సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాజన సభ జరిగింది. ఉద్యోగులకు 2019 పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సహకార ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ధాన్యం కొనుగోలు వల్ల సహకార సంఘం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘాలకు ధాన్యం కొనుగోలు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. డీసీసీబీలో రుణాల మంజూరు జరుగుతున్న జాప్యంపై డీసీసీబీ సీఈఓ సంప్రదింపులు చేయాలని మహాజన సభలో తీర్మానించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదరబోయిన నరసరాజు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి అప్పలరాజు, కోశాధికారిగా ఎం.శివనాగు, ఎ.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పి.తమ్మయ్య, ఉప ప్రధాన కార్యదర్శుగా బి.రామన్న ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారి తోట వెంకట రామయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న చిన్నారులు

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 49వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన కోలాటం భక్తులను అలరించింది. ఉదయం స్వామి వారికి నిత్య హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిత్రాడ సుబ్రహ్మణ్యం బృందం ఆధ్వర్యంలో జరిగిన చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పురుహూతికా అమ్మవారికి బంగారు నెక్లెస్ సమర్పణ

పిఠాపురం: అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠమైన పిఠాపురం పురుహూతికా అమ్మవారికి భక్తులు బంగారు నక్లెస్‌ను ఆదివారం సమర్పించారు. పిఠాపురానికి చెందిన దంగేటి నాగేశ్వరరావు, మహాలక్ష్మి దంపతులు రూ.50 వేల విలువైన 10.550 గ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నక్లెస్‌ను అలంకరించారు. పలువురు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.